

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం

07 జనవరి 2026 పేజీలు : 08

### ఊపిరి ఉన్నంతవరకు
## జనం కోసమే బతుకుతా !
- ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



07 పేజీలో

### దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేసిన
## ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



వివరాలు 2లో

### కేంద్ర ప్రభుత్వ పథకాలపై
# విస్తృత అవగాహన కల్పించాలి

- జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి పథకం అవసరం
- సీఎం చంద్రబాబు సారధ్యంలో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నాం
- ప్రతి పథకాన్ని ప్రజల వద్దకు చేర్చాలి.. జరిగే లబ్ధిని వివరించాలి
- ఎంఎస్ఎంఈల మంజూరులో జాప్యం వద్దు
- గతంలో జరిగిన గృహ నిర్మాణాల అవకతవకలపై విచారణ చేపట్టాలి
- 3వ దిశ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మన్, ఎంపీ వేమిరెడ్డి




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :**

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రతి పథకం అవసరమని, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నెల్లూరు ఎంపీ, జిల్లా అభివృద్ధి, సమన్వయం, పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరు నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దిశ కమిటీ వైస్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, కలెక్టర్ హిమాన్షు శుక్లాతో కలిసి 3వ దిశ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, జిల్లా పరిషత్ ఛైర్మన్ ఆనం అరుణమ్మ, నగర ఇన్‌చార్జి మేయర్ రూప్‌కుమార్ యాదవ్, జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు.

సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి.. గృహ నిర్మాణశాఖ, పరిశ్రమలు, జాతీయ రహదారులు, ఎంఎస్ఎంఈ యూనిట్లకు పిఎంఈజిపి, ప్రధానమంత్రి విశ్వకర్మ, ముద్ర రుణాల మంజూరు, పశుసంవర్ధకశాఖ, వైద్యారోగ్యశాఖలపై చర్చించారు. జిల్లాలో ఎంఎస్ఎంఈల స్థాపన, వాటి స్థితిగతులపై ఆరా తీశారు. రుణాల

-మిగతా 2లో

# చిల్లర మాటలు మానుకో !

### రోజాకు నుడా ఛైర్మన్ కోటంరెడ్డి కౌంటర్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

టీడీపీది అరాచకపు పాలన అయ్యుంటే.. మాజీ మంత్రి రోజా క్షేమంగా నగరి వెళ్ళగలిగేది కాదని నెల్లూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ కేసులకు, రౌడీయిజానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేరాఫ్ అని ఆయన విమర్శించారు. దాడులు, దౌర్జన్యాలు, హత్యలు చేసే వైసీపీ నేతలు.. తమ ప్రభుత్వాన్ని విమర్శించడం దారుణమన్నారు. టీడీపీ నేతల హత్య కేసులో నెల్లూరు జిల్లా సెంట్రల్ జైల్లో ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మంచోడంటూ రోజా వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో కోటంరెడ్డి మీడియాతో మాట్లాడారు. రోజా కూడా టీడీపీని విమర్శించడం చూస్తుంటే

-మిగతా 2లో

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం

### మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని పరామర్శించిన ఆర్కే రోజా



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

నెల్లూరు సెంట్రల్ జైలులో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లిని మాజీ మంత్రి ఆర్కే రోజా మంగళవాం పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కూటమి పాలనలో అరాచక పాలన సాగుతుందన్నారు. టీడీపీ వ్యక్తులు వాళ్ళలో వాళ్ళు చంపుకున్నారని స్వయంగా ఎస్పీ చెప్పారన్నారు. కానీ అక్రమ కేసులో పిన్నెల్లిని, ఆయన సోదరుడుని జైలు పాలు చేశారన్నారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తుందన్నారు. పోలీస్ శాఖ ఖాకీ చొక్కా తిసేసి పసుపు చొక్కా వేసుకుందన్నారు. తమ హయాంలో తప్పుడు కేసులు, వేధింపులకు

-మిగతా 2లో

# దివ్యాంగులకు ట్రై సైకిల్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ప్రశాంతమ్మ



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** మానవ సేవే మాధవ సేవ అన్నది వీపీఆర్ ఫౌండేషన్ నినాదమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. నెల్లూరు మాగుంట లేఔట్‌లోని ఆమె నివాసంలో బుచ్చిరెడ్డిపాలెం మండలం రామచంద్రాపురం, ఇందుకూరుపేట మండలం లేబూరు గ్రామానికి చెందిన దివ్యాంగులకు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి.. రెండు ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ అందజేశారు. నడవలేని దివ్యాంగులలో ఆత్మ విశ్వాసం పెంపొందించాలనే లక్ష్యంతో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బ్యాటరీ ట్రై సైకిళ్ళు అందచేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. నెల్లూరు ఎంపీ నియోజకవర్గం పరిధిలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఇప్పటి వరకు 1100 ట్రై సైకిల్స్ అందజేశామని, కోవూరు నియోజకవర్గంలో దాదాపు 200 మందికి ఈ బ్యాటరీ ట్రై సైకిల్స్ ఇచ్చినట్టు ఆమె స్పష్టం చేశారు. ట్రై సైకిల్స్ అందుకున్న దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వే తమకు కోట్ల రూపాయలతో సమానమన్నారు. ఎలక్ట్రిక్ ట్రై సైకిల్స్ ద్వారా దివ్యాంగులు ఎవరి సాయం లేకుండానే బయటకు వెళ్లి స్వయం ఉపాధి పొందగలరన్నారు. ఆత్మ విశ్వాసానికి వైకల్యం అడ్డుకాదని నిరూపించాలని ఆమె దివ్యాంగులను కోరారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



*(మొదటి పేజీ తరువాయి)*

పాల్పడలేదన్నారు. గుర్తుంచుకోండి తిరిగి మా ప్రభుత్వం వచ్చాక అన్నీ తిరిగి ఇస్తామన్నారు. అధికారులు నేతలకు, లోకేష్‌కు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, నేడు రాష్ట్రంలో గంజాయి, మహిళలపై దాడి, హత్యా రాజకీయాలు చేస్తుంది టీడీపీయేనన్నారు. నచ్చని వారిపై తప్పుడు కేసులు మోపడం, కేంద్ర ర్యాంకింగ్‌లో క్రైంలో 36 స్థానం వచ్చిందంటే సిగ్గు పడాలన్నారు. రాష్ట్ర పరువును గంగపాలు చేశారన్నారు. సంపద అంటూ అప్పులు చేసుకుంటూ పోతున్నారని, నేటితో 3 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. అభివృద్ధి చేసింది శూన్యం, సంక్షేమం జీరో అన్నారు. తాజాగా రాయలసీమ ప్రాంత వాసులకు వెన్నుపోటు పొడిచాడని, రాయలసీమ కరువు పరిష్కారం అయిన లిఫ్ట్ ఇరిగేషన్‌ను ఆపివేయించానని స్వయంగా రేవంత్ రెడ్డి చెప్పారన్నారు. హైదరాబాదులో చంద్రబాబు ఆస్తులు కాపాడుకోవడం కోసం ఈ ఘోరానికి ఒడిగట్టాడన్నారు. రాయలసీమకు అన్యాయం జరుగుతుంటే పవన్ కళ్యాణ్ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ మరో 15 సంవత్సరాలు చంద్రబాబుకు కత్తి అందిస్తావా.. బోగాపురం ఎయిర్ పోర్ట్ విషయంలో క్రెడిట్ చోరీకి దిగారని, ఎన్నికలకు ముందు రాయి వేయడం మాత్రమే చంద్రబాబుకు తెలుసన్నారు. స్వయంగా జీఎంఆర్ కంపెనీ జగన్ హయాంలోనే నిర్మాణం జరుగుతుందని తెలిపిందన్నారు. 2019లో కుప్పంలో ఎయిర్ పోర్ట్ కు చంద్రబాబు వేసిన రాయిని చూడండడని, రామ్మోహన్ నాయుడు మైక్‌ల ముందు హిరో, చేసేది అంతా జీరో అన్నారు. చంద్రబాబు లాంటి అబద్ధపు హామీలు ఇచ్చే వారిని జైలుకు పంపాలన్నారు. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబానికి వైసీపీ అండగా ఉంటుందని ఆర్కే రోజా పేర్కొన్నారు.

# చిల్లర మాటలు మానుకో !

*(మొదటి పేజీ తరువాయి)*

ఏడవాలో.. నవ్వాలో.. అర్థం కావడం లేదన్నారు. టీడీపీని విమర్శించే స్థాయి రోజాకు లేదన్నారు. రోజా ఎంత.. ఆమె బతుకు ఎంతా అంటూ.. వ్యాఖ్యానించిన కోటంరెడ్డి, ఆమె ఒక వలస పక్షవి అంటూ మండిపడ్డారు. టీటీడీ లెటర్స్ అమ్ముకున్న రోజా కూడా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అధికారంలోకి వస్తామని వైసీపీ నేతలు పగటి కలలు కంటున్నారని, అది జరగదన్నారు. గత ప్రభుత్వంలో రిజర్వాయర్స్‌కి నిధులు కేటాయించిన వేస్ట్ ముఖ్యమంత్రి జగన్ అంటూ మండిపడ్డారు. అన్నమయ్య డ్యాం కొట్టుకుపోతే పట్టించుకోలేదన్నారు. సోమశిల ఆఫ్రాన్‌కి నిధులు ఇవ్వమంటే జగన్ పైసా కూడా విడుదల చెయ్యలేదని.. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్ర బాబు విడుదల చేశారని తెలిపారు. రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగులు పెడుతున్నా.. రోజా కళ్ళున్న కాబోదిలా మాట్లాడుతుందన్నారు. ఎవరు అమలు చెయ్యలేని ఎన్నో సంక్షమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. జగన్ అరాచక పాలన చూసి ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి రాలేదన్నారు. పోలవరం, అమరావతి నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో అవినీతికి పాల్పడ్డ రోజా.. నీతి వాక్యాలు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవినీతి అక్రమాలు రౌడీయిజాలు చేసే ప్రతి ఒక్కరూ జైలుకు వెళ్లడం ఖాయమని కోటంరెడ్డి హెచ్చరించారు.

# బీజేపీ జిల్లా కార్యదర్శిగా దాసరి ప్రసాద్ గౌడ్



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా బీజేపీ కార్యదర్శిగా దాసరి ప్రసాద్ గౌడ్‌ని పార్టీ జిల్లా కమిటీ మరోసారి నియమించింది. ఆర్ఎస్ ఎస్ కుటుంబ నేపథ్యం కలిగిన దాసరి ప్రసాద్ గౌడ్ చిన్నతనంనుండి జాతీయ భావజాలంతో పెరిగి, విద్యార్థి దశ నుంచే సంఘ సేవలో చురుకుగా పాల్గొంటూ వచ్చారు. వారు ఏబీవీపీ ద్వారా రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, వీఆర్ కళాశాల అధ్యక్షుడిగా సేవలందించడమే కాకుండా, ఏబీవీపీ విద్యార్థి నాయకుడిగా అనేక కీలక బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు ప్రదర్శిస్తూ, పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు విజయవంతంగా ముందుకు తీసుకెళ్లారు. గతంలో కూడా బీజేపీ నెల్లూరు జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన దాసరి ప్రసాద్ గౌడ్ పార్టీ బలోపేతానికి విశేషమైన సేవలు అందించా రు. జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, దాసరి ప్రసాద్ గౌడ్ సేవలను గుర్తించి, వారికి మరోసారి అవకాశం కల్పించడంపై బిజెపి నాయకు లు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విడవలూరు మండలం రామతీర్థం గ్రామానికి చెందిన దాసరి ప్రసాద్ గౌడ్ వృత్తిరీత్యా న్యాయవాదిగా నెల్లూరు జిల్లా కోర్టులో సేవలందిస్తూ, ఒక ప్రముఖ న్యాయవాదిగా మంచి గుర్తింపు తెచ్చుకున్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలపై విస్తృత అవగాహన కల్పించాలి

*(మొదటి పేజీ తరువాయి)*

మంజూరులో జరుగుతున్న ఆలస్యంపై ప్రశ్నించారు. ఎంఎస్ఎంఈల మంజూరుకు వేగంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో జాతీయ రహదారుల స్థితిగతులు, పెండింగ్ పనులు, ఫ్లై ఓవర్ల ప్రస్తుత స్థితిపై ఆరా తీశారు. పనుల్లో జాప్యంపై అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షమ కార్యక్రమాలను కేంద్ర ప్రభుత్వం పలు పథకాల ద్వారా కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. అనేక పథకాలపై ప్రజలకు, ప్రజాప్రతినిధులకు అవగాహన ఉండడం లేదన్న ఎంపీ, జిల్లాస్థాయిలో, మండలస్థాయిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకు సూచించారు. వ్యవసాయ రంగంలో పది లక్షల విలువైన డ్రోన్ పరికరాల కొనుగోలుకు కూడా కేంద్రప్రభుత్వం 80శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. పెద్దఎత్తున జాతీయ రహదారులకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇటీవల సీఎం చంద్రబాబు 1 లక్ష కోట్ల విలువైన జాతీయ రహదారులను సాధించారని, అప్పటికప్పులు 15 వేల కోట్లను మంజూరు చేయించారన్నారు. పరిశ్రమల స్థాపనకు ఎటువంటి గ్యారంటీలు లేకుండా రూ. 2కోట్ల వరకు రుణం ఇచ్చే అవకాశం కేంద్ర ప్రభుత్వం కల్పించిందన్నారు. పీఎం విశ్వకర్మ ద్వారా చేతి వృత్తులకు రుణాలు మంజూరు చేస్తూ ఆయా వర్గాలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా సద్వినియో గం చేసుకుని జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగ్రామిగా నిలపడమే లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేయాలని ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాల అమలు లో ఎక్కడా అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. పథకాల అమలులో ఏవైనా సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇప్పటికే రెండు సమావేశాలు నిర్వహించుకున్నామని, ప్రతి సమావేశానికి తప్పకుండా పురోగతి ఉండాలన్నారు. నెల్లూ రు జిల్లా అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన అన్నారు.




రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు మాట్లాడుతూ.. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అనుగుణంగా బ్యాంకర్లు పరిశ్రమల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేయాలని సూచించారు. నెల్లూరులోని బీసీ భవన్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు రూ. 4.50 కోట్లు ఖర్చవుతుండగా మంత్రి నారాయణ రూ.కోటి రూపాయలు అందిస్తామని తెలిపారని, మిగిలిన నిధులను తాను, ఎంపీ వేమిరెడ్డి ఎంపీ నిధుల ద్వారా మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ.. జిల్లా గృహ నిర్మాణాల్లో అనేక అక్రమాలు జరిగాయన్నారు. జిల్లాలో నాణ్యతగా లేని 195 ఇళ్లను ధ్వంసం చేసి మళ్లీ నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నిర్మాణాలు సరిగా లేని ఇళ్లకు మరమ్మతు లు చేయించాలన్నారు. ఇందుకు స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హౌసింగ్ అక్రమా లపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. నెల్లూరు బుజబుజ నెల్లూరు నుంచి పెన్నా బ్రిడ్జి వరకు ఫ్లైఓవర్ నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యతో పాటు ప్రమాదాలను నివారించవచ్చని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజా ప్రతినిధులకు సరైన అవగాహన ఉండడం లేదని, పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు.

జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ.. చింతారెడ్డిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అండర్‌పాస్ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. నేషనల్ హైవే నిర్మించి 22 సంవత్సరాలు పూర్తయినా అండర్‌పాస్ ఇంకా నిర్మించలేదని, చాలా రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు స్పందించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి టెండర్లు కూడా పూర్తయ్యాయని, త్వరలోనే పనులు మొదలుకానున్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ.. జిల్లాలో అధికంగా ఉత్పత్తి అయ్యే వేరుశనగ, నిమ్మ పంటలకు అనుగుణంగా విలువ ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణాల్లో గుర్తించిన లోపాలపై ఇప్పటికే పునర్నిర్మాణం, మరమ్మతు పనులు ప్రారంభించామన్నారు. సమావేశంలో జడ్పీ సిఇవో శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో మోహన్‌రావు, ఎపిఐఐసి జడ్ఎం శివకుమార్, డిఎంఅండ్ హెచ్‌వో సుజాత, వ్యవసాయశాఖ జెడి సత్యవేణి, ఎన్‌హెచ్ పిడి చౌదరి, పశుసంవర్ధకశాఖ జెడి రమేష్‌నాయక్, అధికారులు, జడ్పీటీసీలు, ఎంపిపిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# ఉద్యోగాలు కల్పించి నష్ట పరిహారం చెల్లించండి

## ఏపీ జెన్కో అధికారులకు తెలుగు యువత కమిటీ అధ్యక్షుడు రాగాల సూచన

**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం వద్ద ఏపీ జెన్కో భూములను ప్రాజెక్ట్ అధికారులు మంగళవారం పరిశీలించారు. బొగ్గు రవాణా కేంద్రం వద్ద ఉన్న భూములు అధికారులు చూసి గ్రామస్తుల ఉపయోగంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. బొగ్గు రవాణా కేంద్రం విస్తరణ పనులు చేయాలని ఈ నిమిత్తం భూములు ఖాళీ చేయాలని గ్రామస్తులకు సూచించారు. భూములు కూడా గ్రామస్తులే ప్రాజెక్టుకు ఇచ్చారని స్థానికులు సమాధానం చెప్పారు. దీంతో కొంతసేపు ఇరువురి మధ్య చర్చలు జరిగినాయి. గ్రామస్తులు వైపు నుండి అధికార పార్టీ నాయకులు, మండల తెలుగు యువత కమిటీ అధ్యక్షుడు రాగాల శివకృష్ణ ఏపీ జెన్కో అధికారులతో మాట్లాడారు. భూములు సాగు కోల్పోతే గ్రామస్తుల జీవనోపాధి దెబ్బతిని పోతుందని అధికారులు దృష్టికి తీసుకువచ్చారు. భూములు సాగు చేసుకుంటున్న వారి విజ్ఞప్తి మేరకు ప్రాజెక్టులో ఉద్యోగాలు ఇచ్చి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనలను ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ దృష్టికి తీసుకుపోతామని తెలుగు యువత కమిటీ అధ్యక్షుడు ప్రాజెక్టు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో ఉమాదేవి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధీర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన పెంచుకోవాలి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి గ్రామీణ ప్రాంతాల్లో నిరసన ప్రజలు బాల్యవివాహాలు నియంత్రించి నిషేధ చట్టంపై అవగాహన పెంచుకోవాలని కావలిలో సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి తెలిపారు. మంగళవారం కావలి రూరల్ మండలం కట్ట కింద పాలెం గ్రామంలో అంగన్వాడి కేంద్రం ఆవరణంలో బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాలకొండ రెడ్డి మాట్లాడుతూ.. తెలిసి తెలియని వయసులో బాల్య వివాహాలు నిర్వహించడం చట్టరీత్య నేరమని పేర్కొన్నారు. ఇలాంటి వివాహాలు ప్రోత్సహించిన నిర్వహించిన వారికి జైలు శిక్ష జరిమానా లు కూడా ఉంటాయని తెలిపారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాత యువకులకు 21 సంవత్సరం వచ్చేవరకు ఆగి ఆ తరువాత మాత్రమే వివాహాలు నిర్వహించుకోవచ్చు అని తెలిపారు. ముఖ్యంగా ప్రతి వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా బహు భార్యత్వాన్ని నివారించి చెడ్డబద్ధంగా వివాహ వ్యవస్థకు రక్షణ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి కావలి న్యాయవాది ఎలీషా బాబు మాట్లాడుతూ.. మహిళలు మహిళలు చట్టాలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త ఉప్పల మమత గ్రామ మహిళలు తల్లారి కమల, కిషోర్, బాలికలు పాల్గొన్నారు.

# సమాజానికి పిఎంపి, రూడ్స్ సేవలు ఎంతో అభినందనీయం

- అంధులకు నిత్యవసర సరుకులు పంపిణీ
- జిల్లా పీఎంపీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్

**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పియంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని డైకస్ రోడ్ సెంటర్ లోని రూడ్స్ కార్యాలయం నందు ఏలూరు హర్షవర్ధన్ మొదటి జన్మదినాన్ని పురస్కరించుకొని వారి తల్లిదండ్రులు ఏలూరు రాకేష్, కవిత అందజేసిన నిత్యవసర సరుకులను నేత్ర వికలాంగుల సేవా సంస్థలోని దివ్యాంగులైన అంధులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పీఎంపీ గౌరవాధ్యక్షులు అనుముల జయప్రకాష్ మాట్లాడుతూ.. సమాజానికి పిఎంపి, రూడ్స్ సంస్థలు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. పిల్లలు నడువవలసిన త్రోవను వారికి చిన్నప్పటి నుండే నేర్పిన యెడల, వారు పెద్దవారైనా కూడా దానినుండి తొలగిపోరు అన్నారు. తమ పిల్లలు సమాజం పట్ల బాధ్యతాయుతంగా మెలిగి సమాజంలో మంచి పౌరులుగా ఉండేందుకు పిల్లలకు తల్లిదండ్రులు ఇస్తున్న ఇటువంటి ప్రోత్సాహం ఎంతో అవసరంఅని ఆయన అన్నారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ తల్లిదండ్రులు రాకేష్, కవితలను అభినందించారు. సమాజంలో



నిస్సహాయ స్థితిలో ఉన్న అనేకమంది వృద్ధులు, వికలాంగులు, అంధులు, అభాగ్యులు, అన్నార్తులు ఉన్నారని వారికి దాతలు ముందుకు వచ్చి ఏదోవిధంగా తమ సహాయ, సహకారాలు అందజేసి సమాజంలో వారు ఒంటరి వారు కాదు అనే భావన వారిలో కలిగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, పిఎంపి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, విశ్రాంత ఏఎస్ఐ మహబూబ్ బాషా, యస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, కల్యాణ భారతి ట్రస్ట్ చైర్మన్ భారతి, కీర్తి టెక్నాలజీస్ చైర్మన్ చంద్రిక, హెల్పింగ్ హాండ్స్ చైర్మన్ రోస్ మేరీ తదితరులు పాల్గొన్నారు.




# కరటంపాడులో పొలంపిలుస్తోంది

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలం కరటంపాడులో మంగళవారం మండల వ్యవసాయాధికారి కె.కిషోర్‌బాబు ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు ఈకార్యక్రమం నిర్వహించి పంటలసాగులో యాంత్రీకరణను పెంపొందించే విధంగా రైతులకు అవగాహన కల్పించిన కిషోర్‌బాబు చిన్న, సన్నకారు రైతులు ట్రాక్టర్లు, వ్యవసాయపనిముట్లు కొనుగోలుకు బ్యాంకులు విరివిగా రుణసౌకర్యం కల్పిస్తున్నాయని వివరించారు. వివరాలకు తమ సమీప రైతుసేవాకేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి రైతు తప్పనిసరిగా సాగుచేసిన పంట వివరాలను ఈ-పంటలో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ-పంట నమోదుచేసేటప్పుడు మాత్రమే పంటలభీమా, ఇన్‌పుట్‌సబ్సిడి, వ్యవసాయయాంత్రీకరణపథకం, ఇతర వ్యవసాయ పథకాలు రైతులు పొందే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. రైతులు పంటల సాగులో తగిన మెళుకువలు పాటించాలని, వ్యవసాయ సిబ్బంది సూచనలు పాటించాలని, అధికంగా రసాయనిక ఎరువులు, పురుగుమందులు వినియోగించరాదని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో కరటంపాడు విఏఏ లక్ష్మిలహరి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రెండు గ్రామాలలో పొలం పిలుస్తోంది




**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** మండలంలోని లింగంగుంట, మంచాల పల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధికారి ఈ.శైలజ కుమారి ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యరక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి శైలజ కుమారి మాట్లాడుతూ.. వరిలో నీటి యాజమాన్యం, వరిలో ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రైతులువ్యవసాయ పరికరాలు, (ట్రాక్టర్లు, రోటోవేటర్లు, హార్వెస్టర్స్) కొరకు గ్రామ వ్యవసాయ అసిస్టెంట్స్‌ని సంప్రదించినట్లు అయితే వారు బ్యాంకులో అప్లికేషన్ ఇచ్చి వ్యవసాయ అధికారి ద్వారా బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి వ్యవసాయ పరికరాలకు లోన్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణవేణి, వ్యవసాయ సహాయకులు పోలయ్య, పెంచయ్య, లింగంగుంట, మంచాలపల్లి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## పాస్ పుస్తకాలు పంపిణీ



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు మండలంలోని నంది గుంట పంచాయతీలో రైతుల రెవిన్యూ శాఖ అధికారులుపాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి స్థానిక టిడిపి నేతలు హాజరయ్యారు. సర్పంచ్ చిలకల కాజారెడ్డి రైతులను ఉద్దేశించి టిడిపి నాయకులు చిలకల వెంకటరెడ్డి జయంత్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఫోటోలు పాసు పుస్తకాలపై ముద్రించి పంపిణీ చేశారని ప్రస్తుత టిడిపి ప్రభుత్వంలో రాజముద్ర కలిగిన పాస్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నామన్నారు. మొత్తం గ్రామంలో 437 పాస్ పుస్తకాలను కాను మొదటి విడత 105 పాస్ పుస్తకాలను ప్రస్తుతం పంపిణీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రవితేజ, విలేజ్ సర్వేయర్ హరి తదితరులు ఉన్నారు.

## సచివాలయం ఉద్యోగులు

# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సచివాలయ ఉద్యోగులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జీఎస్ డబ్ల్యూఎస్ డిప్యూటీ ఎంపీడీవో సయ్యద్ కరీముల్లా హెచ్చరించారు. మంగళవారం మండలంలోని శక నాలపల్లి, నేలటూరు, కృష్ణంపల్లి, ఉదయగిరి-1 సచివాయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా సచివాలయాల్లో ఉద్యోగుల అటెండెన్స్, మూమెంట్ రిజిస్టర్లను పరిశీలించారు. ప్రతి ఉద్యోగి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా వేయాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలందించడంతోపాటు ప్రభుత్వం సూచించిన అన్ని సర్వేలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలని వైసీపీ కుట్ర

## మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ఆకాశం పైన ఉమ్ము వేస్తే తిరిగి పైనే పడుతుందని, మాపై బురద చల్లారని చూస్తే, అది మీపై పడుతుందని వింజమూరు టీడీపీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వింజమూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీపీ వనిపెంట హైమావతి, ఎంపీటీసీ సభ్యులు, నాయకులతో కలిసి గూడా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయాలని వైసీపీ నాయకులు కుట్ర చేశారని మండిపడ్డారు. ఎనిమిది మంది ఎంపీటీసీలు వైసీపీ పై గెలిచిన నాడే ఎంపీపీగా పోటీ చేసి ఎంపీటీసీ విశ్వాసం కోల్పోయి ఓడిపోయిన ఎంపీటీసీ సభ్యులు పల్లాల కొండారెడ్డి ఈరోజు ముగ్గురు ఎంపీటీసీలతో ఎలా నెగ్గాలని సిద్ధమయ్యారు చెప్పాలన్నారు. చేసిన తప్పును కప్పి పుచ్చుకునేందుకు తెలుగుదేశం పార్టీపై మాపై నిందలు వేయడం సరైన కొత్తది కాదన్నారు. బులుగు మీడియాని అడ్డం పెట్టుకొని అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోబోమని, నిజాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. చట్టబద్ధంగా ఎంపీపీ ఎన్నిక జరిగిందని, మా ప్రభుత్వంలో కూడా మీరు రౌడీయిజం చేసి, మా ఎంపీటీసీలను కిడ్నాప్ చేసి వారిని భయబాంతులకు గురిచేసి మా పార్టీపై అసత్య ప్రసారం చేస్తారా అంటూ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. తగిన సమయంలో సరైన బుద్ధి చెప్తామని, ఘాటుగా విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు వైసీపీ నాయకులు ఎంతోమంది ఆకర్షితులై తెలుగుదేశం పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని త్వరలో వైసిపి పార్టీ నియోజకవర్గంలో ఖాళీ అవుతుందన్నారు. మీరు ఎన్ని కుట్రలో చేసిన ప్రజాస్వామ్యం గెలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో, మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, బసిరెడ్డి సుమలత, ఎంపీటీసీ సభ్యులు, గవ్వల మల్లికార్జున, పల్లా పురుషోత్తం, కాటం ప్రసన్న, సాదం మౌనిక, పట్టణ అధ్యక్షులు గురజాల గోపి, ప్రధాన కార్యదర్శి, చల్లా శ్రీనివాసులు యాదవ్, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, సొసైటీ డైరెక్టర్ కోడూరు నాగిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ చేబ్రోలు వసంతరావు, కే.శ్రీనివాసులు నాయుడు, అంకి పెద్దన్న, గవ్వల సుందరయ్య, గవ్వల రాము తదితరులు ఉన్నారు.

# ప్రమాదంలో గాయపడిన జనసైనికుడికి ఆర్థిక సహాయం



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** ఇటీవల జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏఎస్ పేటకు చెందిన జనసేన పార్టీ కార్యకర్త కప్పల వెంగళరావు అనే వ్యక్తికి ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ తరపున ఆర్థిక సహాయాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. జన సైనికుడు కప్పల వెంగళరావు ప్రమాదంలో గాయపడి కాళ్లు విరగడం వల్ల తన కుటుంబ ఆర్థిక ఇబ్బందుల్లో ఉండడంతో ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ నేతలు గుర్తించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ సూచనల మేరకు జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గం సీనియర్ నాయకులు చదలవాడ హరీష్‌కుమార్ ఆధ్వర్యంలో నియోజకవర్గ తరఫున బాధితుడికి 28వేల రూపాయల నగదు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాకుండా జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆలోచనలు ఆశయాలను ఆచరణలో చూపించడం జరుగుతుందని తెలిపారు. సమాజంలో కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికి అండగా నిలవాలన్న పవన్ కళ్యాణ్ సంకల్పాన్ని ముందుకు తీస్తుళ్తూ ఉన్నామని పేర్కొన్నారు. జనసేన పార్టీ తన ప్రతి జన సైనికుడిని కుటుంబ సభ్యుడిగా భావిస్తూ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. అలాగే కష్ట కాలంలో ఉన్న జన సైనికుడికి అండగా నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జమీర్ కృష్ణారెడ్డి రవికుమార్ రిషికేష్ యాదవ్ పవన్ యాదవ్ ఏఎస్పేట మండల జనసేన పార్టీ అధ్యక్షులు సయ్యద్ అక్బర్ బాషా సంగం మండల సీనియర్ నాయకులు దాడి భాను కిరణ్ వనం పవన్ తోడేటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రత కోసమే కార్డన్ సెర్చ్





**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రజల శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు కావలి డిఎస్పీ శ్రీధర్ పేర్కొన్నారు. వింజమూరు పట్టణంలోని బీసీ కాలనీలో కాటన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కాటన్ సెర్చ్‌లో భాగంగా మొత్తం 47 వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటిలో 44ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ఈ కాటన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు. ప్రజల్లో భద్రతాభావం పెంచడమే లక్ష్యంగా ఇటువంటి తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. అదేవిధంగా రహదారి ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు. పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ కోరారు. బీసీ కాలనీ వాసులను డిఎస్పి శ్రీధర్ పలకరించి సమస్యలు ఏవైనా ఉంటే తెలపాలని కోరారు కొందరు మహిళలు కూలి పనికి వెళ్ళిన డబ్బులు కూడా ఒక పెద్ద మనిషి ఇవ్వలేదని ఆయన దృష్టికి తీసుకువచ్చారు పిలిపించి మాట్లాడుతామని ఓ కంప్లైంట్ ఇవ్వవలసిందిగా ఆయన మహిళలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కలిగిరి సీఐ వెంకటనారాయణ, వింజమూరు ఎస్సై వీర ప్రతాప్, కలిగిరి ఎస్సై ఉమాశంకర్, కొండాపురం ఎస్సై మాలాద్రి, వరికుంటపాడు ఎస్ఐ రఘునాథ్, జలదంకి ఏఎస్ఐ సుబ్బారావు కానిస్టేబుళ్లు, మహిళా పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ వింజమూరు కార్యక్రమం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ సంక్రాంతి స్వచ్ఛ వింజమూరు కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక లక్ష్మ ప్రియ థియేటర్ సమీపంలోని పంట కాలువ పూడికతీత పనులను చేపట్టారు. ఎంతోకాలంగా ఈ కాలువ పిచ్చి మొక్కలతో నిండి నీరు వెళ్లేందుకు వీలుగా లేకుండా ఉండింది దాంతో దోమలు వృద్ధి చెంది వివిధ రకాలైన సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. అంతేకాకుండా కాలువల నుండి వచ్చే దుర్వాసన వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రహించిన పంచాయితీ పాలకులు స్పందించి సర్పంచ్ ఎన్.సుజన, ఈఓ రామారావులు జేసీపీ సహాయంతో కాలువ కూడిక తీత తీయించారు. పూడిక తీత వలన కాలువలో నీరు సజావుగా వెళ్లడంతో పరిస్థితులు చక్కబడినట్లు అయింది అంతేకాకుండా అక్కడే ఉన్న కల్వర్టు అయిపోవడంతో ప్రస్తుతం అది కనిపించి ప్రమాదాలకు గురికాకుండా ఉండే అవకాశం ఉంది దీంతోపాటుగా కల్వర్టు నిర్మాణం కూడా చేయించినట్లయితే ప్రమాదాలను నివారించిన వారవుతారని స్థానిక ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.

## 108 వాహనంలో సురక్షతంగా ప్రసవం



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన వై. భాగ్యమ్మకు ఒక్కసారిగా నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. ఉదయగిరికి తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ అయ్యాయి. ఈఎంటి సిబ్బంది సయ్యద్ అలీ, పైలట్ రహంతుల్లా ఆమెకు సురక్షతంగా ప్రసవం చేశారు. పండింటి మగ బిడ్డకు ఆమె జన్మనిచ్చారు. తల్లి బిడ్డను ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమెకు ఇది తొలి కాన్పు కావడంతో సురక్షతంగా సాధారణ కాన్పు చేసినందుకు 108 సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## పన్నులు చెల్లించండి నగరాభివృద్ధి

# సహకరించండి : కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ మొండి బకాయిలను వసూలు చేసే కార్యక్రమంలో భాగంగా స్థానిక టేక్కేమిట్ట ప్రాంతంలోని ఆస్తి పన్ను బకాయిలు ఉన్న పి.అక్కయ్య, ఎం.వెంకటరావులను రెవెన్యూ విభాగం అధికారులతో కలిసి స్వయంగా మంగళవారం వెళ్లి కలిశారు. నగరవ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులకు అవసరమైన మూలధనాన్ని ప్రజలు చెల్లించే పన్నుల నుంచే వినియోగించగలమని, నగరాభివృద్ధిలో బాధ్యతగా భావించి భాగస్వాములు కావాలని కమిషనర్ వారికి సూచించారు. రెండు అసెస్మెంట్లకు సంబంధించి సుమారుగా 6 లక్షల రూపాయలు పన్ను బకాయిల విషయమై వారితో మాట్లాడి అపరాధ రుసుముతో సహా బకాయిలు చెల్లించమని కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, రెవెన్యూ విభాగం అధికారి శ్రీనివాసులు, వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

# వార్డు సచివాలయం కార్యదర్శులకు శిక్షణ తరగతులు




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ వారి ఆదేశముల మేరకు నాలెడ్జి పార్ట్నర్స్ అయిన ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్ గవర్నమెంట్ ఆధ్వర్యంలో నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ అంశంపై వార్డు సచివాలయ కార్యదర్శులకు శిక్షణ తరగతులను మంగళ వారం నిర్వహించారు. శిక్షణ తరగతులకు మేయర్ రూప్ కుమార్ యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2022వ సంవత్సరంలో సఫాయిమిత్ర సురక్ష చాలెంజ్ కార్యక్రమంలో భారత దేశంలో నెల్లూరు నగరపాలక సంస్థ తొలి స్థానంలో నిలిచి పది కోట్ల రూపాయల బహుమానాన్ని గెలుచుకుందని తెలిపారు. అదే స్ఫూర్తితో స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఉత్తమ ర్యాంకును సాధించే దిశగా వార్డు సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్మెంటల్ కార్యదర్శులు శిక్షణ పొంది అన్ని అంశాలలో అనుభవం తెచ్చుకోవాలని సూచించారు. పట్టణ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఆలోచనలతో నగర పాలక సంస్థ పరిధిలో ప్రణాళిక బద్ధంగా పారిశుధ్య నిర్వహణ పనులను చేపడుతున్నారని, మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచేలా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం కమిషనర్ వైఓ నందన్ మాట్లాడుతూ.. భారతదేశ వ్యాప్తంగా ఉన్న సుమారు 700కు పైగా లోకల్ బాడీలు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 123 మున్సిపాలిటీలకు ధీటుగా స్వచ్ఛ సర్వేక్షన్ లో నెల్లూరు నగరపాలక సంస్థ ఉత్తమ ర్యాంకును సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాంకు సాధన కోసం గతంలో చేపట్టిన విధివిధానాలను, నిర్దిష్ట ప్రమాణాలను పాటిస్తూ దేశవ్యాప్తంగా నెల్లూరు నగరపాలక సంస్థ ఐదు స్థానాల లోపు నిలిచేలా ప్రతి ఒక్కరు నిబద్ధతగా విధులు నిర్వహించాలని సూచించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలో వేస్ట్ టు కంపోస్ట్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసి రీసైక్లింగ్ విధానంలో సమూలమైన మార్పులు తీసుకొస్తామని కమిషనర్ వివరించారు. శిక్షణ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కనకాద్రి, ఆర్‌పిలు జయ మాధురి, తిరుపతి రావు, వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

# మర్రిపాడులో జనసేన క్యాలెండర్లు పంపిణీ



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన మర్రిపాడులో మంగళవారం జనసేన పార్టీ నాయకులు మెగా జనసేన క్యాలెండర్లను పంపిణీ చేయడం జరిగింది. ఈ పంపిణీలో ఎస్సీ సెల్ నాయకులు కన్నీమరకల రమణయ్య పాల్గొని జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చేస్తున్నటువంటి సేవలతోపాటు కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అనంతరం జనసేన మండల అధ్యక్షులు ఓరుగంటి ప్రమీల మాట్లాడుతూ.. మెగా జనసేన క్యాలెండర్లు అందించిన కడప జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు పండ్రా రంజిత్ కుమార్కి ధన్యవాదాలు తెలిపారు. అలాగే మర్రిపాడు మండలంలో జనసేన పార్టీ బలోపేతానికి అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మర్రిపాడు మండల సీనియర్ నాయకులు తిరుమలశెట్టి ప్రసాద్, కూరాకు శైలేంద్ర కుమార్, చిలకపాటి సుబ్బయ్య, కన్నెమరకల తిరుపతి, జనసేన చిన్న తదితరులు పాల్గొన్నారు.

# సోమశిల గ్రామ అభివృద్ధిపై చర్చ



**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుమార్తె ఆనం కైవల్యా రెడ్డితో మంత్రి ఆనం నివాసంలో మంగళవారం ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ పర్యవేక్షణలో ఆత్మకూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఉపాధ్యక్షులు కంటే శ్రీనివాస్ భరత్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు ఉదయగిరి రవి సోమశిల అభివృద్ధి పనులపై ఆనం కైవల్యా రెడ్డితో చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ నుంచి సోమశిల గ్రామం వరకు సిమెంట్ రోడ్డు మంజూరు చేయించాలని, గ్రామంలోని సీసీ రోడ్లు మంజూరు చేయాలని, ఏడు గ్రామాల ప్రజలకు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న నూతన బ్యాంకు నిర్మాణ పనులను చేపట్టాలని, మత్స్యకార కాలనీలోని ఉత్తర కాలవకు రక్షణ గోడను మంజూరు చేయాలని కోరారు. పై విషయాలు మంత్రి ఆనం దృష్టికి తీసుకుని వెళ్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఎం.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 10 నుంచి జిల్లాస్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ పోటీలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించనున్నట్లు ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెరుకూరు ఖాజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మే కపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్పర్సన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మేకపాటి శాంతికుమారిల సహకారంతో ఎంఎస్కే యువసేన, ఆంధ్ర విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఈనెల 9వ తేదీలోపు రూ.500లు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.30,116లు, రూ.20,116లు, రూ.10,116లు చొప్పున నగదు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 9381237040, 9121900127 అనే నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. అనంతరం క్రికెట్ పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఖాజానవాజ్, ఖలీల్, మహబూబాబాషా, సంతోష్, సమీద్ తదితరులు పాల్గొన్నారు.

# గత వారం వైసీపీ నాయకులే నన్ను కిడ్నాప్ చేశారు.. టీడీపీ వాళ్ళు కాదు

- నేను వైసీపీ నుండి గతంలో టీడీపీలో చేరా..
- నా మద్దతు టీడీపీకే, మా నాయకుడు ఎమ్మెల్యే కాకర్ల
- ఊటుకూరు ఎంపీటీసీ సభ్యులు గవ్వల మల్లికార్జున..




**వింజమూరు, మేజర్‌న్యూస్ :** నన్ను ఎవరు తీసుకువెళ్ళలేదని, నేను ఇంటి వద్ద క్షేమంగా ఉన్నానని, ఊటుకూరు ఎంపీటీసీ సభ్యులు గవ్వల మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం వింజమూరులోనీ తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో, ఎంపీపీ హైమావతి, ఎంపీటీసీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గవ్వల మల్లికార్జున మాట్లాడుతూ.. గత వారం రోజుల క్రితం ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ని పార్టీ కార్యాలయంలో కలిసి మా గ్రామమైన తుళ్ళపాడు వెళుతున్న క్రమంలో ఊటుకూరు సమీపంలో నన్ను కొంతమంది వైసీపీ నాయకులు అటకాయించి, తీసుకువెళ్లారని, నా ద్విచక్ర వాహనం కూడా అక్కడే వదలడం జరిగిందని, వింజమూరు ఎంపీపీ ఎన్నిక నేపథ్యంలో ఈ కిడ్నాప్ జరిగినట్లు నేను గ్రహించానని, అప్పటినుండి మా కుటుంబ సభ్యులు అన్నదమ్ములు ఆందోళనతో ఉన్నారని, ఈ విషయం తెలుసుకున్న టిడిపి సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి వింజమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందని, అప్పటినుండి పోలీసులు గాలిస్తున్నారని, ఎంపీపీ ఎన్నిక నే పథ్యంలో సోమవారం 5వ తేదీ నన్ను ప్రత్యేక వాహనంలో వైసిపి నాయకులు తీసుకురావడం జరిగిందని, వారి బందీలో ఉన్న నన్ను తహసిల్దార్ కార్యాలయం గేటు సమీపంలో మా అన్నదమ్ములు వచ్చి నన్ను తీసుకువెళ్లారే తప్ప నన్ను ఎవరు కిడ్నాప్ చేయలేదని, నన్ను తీసుకువెళుతున్న క్రమంలో, ఎంపీటీసీ సభ్యులు పల్లాల కొండారెడ్డి పెద్దగా కేకలు వేయడంతో, నేను భయపడి ఓటింగ్‌లో పాల్గొనకుండా ఇంటికి వెళ్లడం జరిగిందన్నారు. నేను వైసీపీ పార్టీ తరపున ఎంపీటీసీగా గెలిచినప్పటికీ, నాకు తగిన ప్రాధాన్యత గుర్తింపు ఇవ్వని నేపథ్యంలో, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ చేస్తున్న ప్రజాసేవకు ఆకర్షితుడై, ఊటుకూరు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గత సంవత్సరం సెప్టెంబర్ 13వ తేదీన ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సమక్షంలో తెలుగుదేశం ప్రధాన పార్టీ కార్యాలయంలో, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరానన్నారు. ఆనాటి నుండి నేటి వరకు తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతూ ఊటుకూరు ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీ హైమావతి ఆధ్వర్యంలో ఊటుకూరు అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఇందులో ఎలాంటి ప్రలోభాలు లేవని, మీడియాలో జరుగుతున్న ప్రసారాన్ని చూసి స్వయంగా మా ఎంపీటీసీ సభ్యులు ఎంపీపీ హైమావతి, స్థానిక నాయకులతో, కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతకుముందు ఎంపీపీ హైమావతికి శుభాకాంక్షలు తెలియజేశారు. మండలాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, ఎంపీపీ వనిపెంట హైమావతి, మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, బసిరెడ్డి సుమలత, ఎంపీటీసీ సభ్యులు, కాటం ప్రసన్న, సాధం మౌనిక, పల్లా పురుషోత్తం, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, అంకి పెద్దన్న, పట్టణ అధ్యక్షులు గురజాల గోపి, సొసైటీ డైరెక్టర్ కోదూరు నాగిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జ్ చేబ్రోలు వసంత రావు, మండల ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాసుల యాదవ్, కే.శ్రీనివాసులు నాయుడు, గవ్వల సుందరయ్య, గవ్వల రాములు ఉన్నారు.

# ఆయుష్ విదానాలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం

## ఆశాలకు అవగాహనా కార్యక్రమం : డాక్టర్ కరుణాకర్



**నెల్లురు సిటీ, మేజర్‌న్యూస్ :** ఇనమడుగులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన ఆశా డే కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం వారు ముద్రించిన ఆశాకార్యకర్తల కొరకు అవగాహనా పుస్తకంను ఆశా ఆరోగ్య కార్యకర్తలకు పంచడమె కాదు పుస్తకములోని అంశాలను వివరించి అందరిని ఆయుష్ విదానాల పట్ల చైతన్యం కలిగించారు డాక్టర్ కరుణాకర్. గ్రామాల్లోని ప్రజల ఆరోగ్య సమ్రక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న ఆశాలకు ఆయుష్ విదానాల అవగాహన ద్వార ప్రజలు సంపూర్ణ ఆరోగ్యం పొందేలా చెయ్యటం ద్వారా ఆరోగ్యసమాజాన్ని నిర్మిస్తు వైద్యఖర్చులను తగ్గించవచ్చునన్నారు. ముఖ్యంగా అల్లోపతి విదానాల తో తగ్గని రోగాలకు సైతం ఆయుష్ మంచి సమాదానమని మన పరిసరాల్లో పెరిగే లెదా మందులుగా ఉపయోగించె చెట్లను పెంచెలా, వాటిని రోగాలను తగ్గించుకునెలా ప్రజలను చైతన్యపరిచె బాద్యతను ఆశా కార్యకర్తలు తీసుకోవాలని సూచించారు. ఆయుష్ ద్వారా ఆరోగ్య సమ్రక్షణ, సాదారణ వ్యాధులతోపాటు దీర్ఘకాలికంగా ఇబ్బంది పెడుతున్న మధుమేహవాధి హైపర్ టెన్సన్ నియంత్రణ, సాదారణ ఔషద మొక్కలు వాటి ఉపయోగాలు, గృహవైద్యం, ఆయుర్వేదం, హొమియోపతి, యూనాని, యోగా అంటె ఏమిటి వాటి ఉపయోగించుకోనె సందర్భాలు, ఆరోగ్యకరజీవనం కోరకు అనుసరించాల్సిన పద్దతులు వాటిల్లో ఆశా, ఆరోగ్య కార్యకర్తల పాత్ర గురించి వివరించారు సరియైన ఆహారం, అలవాట్లు, ఆలోచనలు ద్వారా సంపూర్ణరోగ్యం సాద్యం అని అందుకోసము ప్రతి ఓక్కరు కృషి చెయ్యాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్నా అయుష్ వైద్యవిదానాలను ప్రజలకు చేరువయ్యేలా చెయ్యాలని సూచించారు. ప్రతి ఓక్కరు రోగాల నియంత్రణలో ఆహారం పాత్రను గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాదమిక ఆరోగ్యకేంద్ర డాక్టర్లు నిరంజన్, ఇర్ఫాన్, ఆరోగ్యసిబ్బంది, రామక్రీష్ణ ఆశా కార్యకర్తలు పాల్గోన్నారు.



# చలికాలంలో పెరుగుతున్న కీళ్ల నొప్పులు

## వృద్ధులే కాదు.. జెన్- జెడ్ కూడా బాధితులే.. : డాక్టర్ శశిధర్ రెడ్డి

**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** చలికాలం వచ్చిందంటే చాలు, వృద్ధులలో కీళ్ల నొప్పులు రావడం సహజం. కానీ, ప్రస్తుత పరిస్థితులు ఆందోళనకరంగా మారుతున్నాయి. ఇప్పుడు ఈ సమస్య కేవలం 60 ఏళ్లు పైబడిన వారికే పరిమితం కాకుండా, యువతలో ముఖ్యంగా జెన్ జెడ్, వర్క్ ఫ్రమ్ హోమ్ చేసే వారిలో వేగంగా పెరుగుతోందని మెడికవర్ హాస్పిటల్ సీనియర్ ఆర్థోపెడిక్ అండ్ జాయింట్ రిప్లేస్‌మెంట్ కన్సల్టెంట్ డాక్టర్ శశిధర్ రెడ్డి హెచ్చరించారు. 35 ఏళ్ల లోపు వారిలో 40 శాతం మంది మార్నింగ్ స్టిఫ్నెస్ (ఉదయాన్నే కీళ్ల గట్టితనం) ఎదుర్కొంటున్నారు. జెన్ జెడ్ నిపుణుల్లో ప్రతి నలుగురిలో ఒకరికి మోకాలి లేదా వెన్నునొప్పి వస్తోంది. మహిళల్లో ఆర్థరైటిస్ ప్రమాదం పురుషుల కంటే 1.5 నుంచి 2రెట్లు ఎక్కువగా ఉంది. యువతలో సమస్యకు కారణాలేమిటి? యువతలో ఈ సమస్యలు పెరగడానికి ప్రధాన కారణం వారి జీవనశైలి అని డాక్టర్ తెలిపారు. దీనిని ఆయన 'బిహేవియరల్ ఆర్థరైటిసు అని పేర్కొన్నారు. రోజుకు 8 గంటలకు పైగా కదలకుండా కూర్చుని పనిచేయడం వల్ల కీళ్ల నొప్పుల ప్రమాదం 60 శాతం పెరుగుతుంది. విటమిన్ డి లోపం, ఎండలోకి వెళ్లకపోవడం వల్ల ఎముకలు బలహీనపడుతున్నాయి. ఎక్కువ సేపు స్మార్ట్‌ఫోన్ లేదా ల్యాప్‌టాప్ వాడకం వల్ల వెన్నెముకపై ఒత్తిడి పడుతోంది. నిద్రలేమి, మానసిక ఆందోళన, రోజువారీ పనులలో మందగమనం వంటివి కుటుంబాన్ని ప్రభావితం చేస్తాయని వైద్యులు విశ్లేషిస్తున్నారు. 'చలికాలంలో రక్త ప్రసరణ తగ్గుతుంది కాబట్టి, కీళ్ల ఆరోగ్యం కోసం రోజువారీ వ్యాయామం తప్పనిసరి. ప్రతి గంటకు ఒకసారి లేచి చిన్నపాటి స్ట్రెచింగ్ చేయడం, విటమిన్ డి కోసం కాసేపు ఎండలో నడవడం వంటి చిన్న అలవాట్లు భవిష్యత్తులో వచ్చే పెద్ద సమస్యల నుండి మిమ్మల్ని కాపాడతాయి.' అని డాక్టర్ శశిధర్ రెడ్డి తెలిపారు.

# మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలు సాగిస్తాం

## ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఉపాధ్యాయ ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ ఆశయాలను కొనసాగిస్తామని, అనుసరిస్తామని ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఏపిటిఎఫ్ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ ఉద్యమపితామహుడు, స్ఫూర్తి ప్రదాత మార్పు బాలకృష్ణమ్మ 13వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత బాలకృష్ణమ్మ చిత్రపటానికి వారు పూలమాల వేసి ఘననివాళులర్పించారు. ఈసందర్భంగా ఏపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ మార్పు బాలకృష్ణమ్మ ఉపాధ్యాయ ఉద్యమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని వారు ప్రతిజ్ఞ చేశారు. నేడు ఉపాధ్యాయులు పొందుతున్న రీగ్రూపింగ్‌స్కేళ్ళు, అప్రయత్న యాంత్రిక పదోన్నతి, 010పద్దు క్రింద జీతాలు పొందడం తదితర అనేక సౌకర్యాలు మార్పు బాలకృష్ణమ్మ పోరాటాల ఫలితంగానే సాధించుకున్నవని ఆయన గుర్తు చేశారు. బాలకృష్ణమ్మ జీవితం ఉపాధ్యాయ ఉద్యమానికేకాకుండా శాసనమండలిలో రైతాంగ సమస్యలపై గళం విప్పి పోరాటాలు చేసిన మహనీయవ్యక్తి అని ఆయన సేవలు, పోరాటాలను అల్లంపాటి కొనియాడారు. ఉద్యమాల కోసం జైలుజీవితం గడిపిన త్యాగశీలి బాలకృష్ణమ్మ అని తెలిపారు. ప్రస్థుత తరం ఉపాధ్యాయులందరూ బలమైన ఉపాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించి విద్యాభివృద్ధికి పాటుబడినప్పుడే బాలకృష్ణమ్మకు నిజమైన నివాళులని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఏపిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఆర&?వెంకటేశ్వర్లురెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, పెంచలయ్య, మండలాల బాధ్యులు రత్నారెడ్డి, శివరామిరెడ్డి, తిరుపతిరెడ్డి, రామకృష్ణారెడ్డి, పి.శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, ఖాజారెడ్డి, దయాకర్, సుబ్రహ్మణ్యం, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణపై శిక్షణ కార్యక్రమాలు




**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో మున్సిపల్ ఛాంబర్ కార్యాలయంలో మంగళవారం పచ్ఛ సర్వేక్షన్ 2026లో భాగంగా కావలి మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సానిటరీ సెక్రటరీ స్వచ్ఛ సర్వేక్షన్ పై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్‌లో నిర్వహించవలసిన కార్యక్రమాలు పారిశుద్ధ్య నిర్వహణ, ప్లాస్టిక్ నిషేధం వివిధ అంశాలపై క్షణ్ణంగా అవగాహన కల్పించారు. దీనికి సంబంధించిన ఆదేశాలు కూడా జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీ, శానిటరీ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# కున్నం శివరామిరెడ్డి మరణం బాధాకరం



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డికి అత్యంత సహితుడైన కున్నం శివరామిరెడ్డి మరణించారు. విషయం తెలుసుకున్న కావలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విషయం తెలుసుకొని వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే వారు మాట్లాడుతూ.. కావలి రూరల్ మండలం గౌరవరం గ్రామానికి చెందిన కున్నం శివరామిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని, పార్టీలో నిజాయితీ, నిబద్ధత కలిగిన వ్యక్తి అని వారు తెలిపారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సమావేశం

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని తిక్కన ప్రాంగణంలో జిల్లా సంయుక్త కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లాలోని మిల్లర్స్ అసోసియేషన్ మిల్లర్స్ తో కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణం లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశ ముఖ్య ఉద్దేశ్యం రాబోయే రబీ సీజన్ సంబంధించి లేట్ ఖరీఫ్, ఎర్లీ రబీ మన జిల్లాలో ఫిబ్రవరి, మార్చి నెలలో ధాన్యం సేకరణ దానికి సంబంధించినటువంటి ఏర్పాట్లు దాంట్లో మిల్లర్ల యొక్క పాత్ర వారు సమకూర్చవలసిన బ్యాంకు గ్యారంటీలు, ధాన్యం సేకరణకు గోని సంచులు తదితర ఏర్పాట్ల గురించి మిల్లర్లందరికీ వారి అసోసియేషన్ వారికి జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు తగు సూచనలుఇవ్వడం జరిగింది. జిల్లాలోని రైతులు ఏ విధంగాను నష్టపోకుండా వారు పండించిన పంటకు సరైనటువంటి మద్దతు ధర కల్పించే దిశగా మిల్లర్లు అందరూ సహకరించవలసినదిగా జేసీ తెలియజేశారు. అదేవిధంగా మిల్లర్ల దగ్గర నుంచి వారికున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కార మార్గంగా చేసే విధంగా ప్రభుత్వానికి నివేదించి ఏ విధమైనటువంటి ఇబ్బందులు లేకుండా దాన్యం సేకరించడానికి సమయత్వం అవ్వాల్సినదిగా జాయింట్ కలెక్టర్ సూచించారు. ధాన్యం సమీకరణకు అన్ని రకాల ప్రభుత్వ వ్యవస్థలను దీనిలో భాగస్వాములుగా చేసి రైతులకు ఏ రకమైన ఇబ్బంది లేకుండా చేయవలసినదిగా సంబంధిత ప్రభుత్వ వ్యవస్థలను కూడా ఆదేశించడం అదేవిధంగా వారు తీసుకోవలసినటువంటి చర్యలు వారికి తెలియజేయడం కూడా జరిగింది. మిల్లర్ల యొక్క అభ్యర్థన మేరకు మరి ఒక్కసారి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయటానికి జాయింట్ కలెక్టర్ అంగీకారం కూడా తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్ఓ లీల రాణి, జిల్లా మేనేజర్ పౌరసరఫరాల సంస్థ ఏఎస్ఓలు, సహాయ మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వివరాలు తప్పనిసరిగా

# అన్‌లైన్‌లో నమోదు చేయాలి

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయ వివరాలను టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టంలో తప్పనిసరిగా నమోదు చేయాలని ఎంఈవో-1 టీ.వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం పట్టణంలోని నార్త్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు షూ సైజులను త్వరగా లీప్ యాప్ నందు, పరీక్షల అనంతరం విద్యార్థుల మార్కులను ఆన్లైన్లో నమోదు చేయాలన్నారు. పాఠశాల రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు.

# ఊపిరి ఉన్నంతవరకు జనం కోసమే బతుకుతా

## ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి




**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** తన ఊపిరి ఉన్నంతవరకు ధనం కోసం కాకుండా జనం కోసమే బ్రతుకుతానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. పొదలకూరు మండలం పార్లపల్లిలో రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మంగళవారం సాయంత్రం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోమిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో యూనిట్ కు 13 పైసలు చొప్పున కరెంటు చార్జీలను తగ్గించిందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.32 వేల కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రజల నడ్డి విరిచిందని ఆరోపించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలను పూర్తిగా రద్దు చేసిందని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన రీ సర్వే పాపాలను సరి చేస్తున్నామని తెలిపారు. రీ సర్వే పేరుతో గత ప్రభుత్వం ప్రజల ఆస్తులను నిషేధిత భూముల జాబితాలో చేర్చిందని వాటన్నింటిని తొలగించమని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. ఎవరు అడిగారని రాష్ట్రమంతా సర్వే చేశారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రీ- సర్వే పేరుతో పార్లపల్లి, మరిపల్లి గ్రామాలలోని భూములన్నింటిని 22 - ఏ లో చేర్చిందని ఇప్పుడు తాను అధికారులతో మాట్లాడి వాటిని సరి చేయించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన లీలలు అన్ని ఇన్నీ కావన్నారు. ఇన్కమ్ టాక్స్ కట్టే వాళ్లకు గత ప్రభుత్వంలో మరుపూరు రెవెన్యూలో ఐదు ఎకరాలు చొప్పున 57 ఎకరాలు కట్టబెట్టారని అన్నారు. అక్రమంగా భూములు కట్టబెట్టిన తాసిల్దార్ సస్పెండ్ కావడం జరిగిందన్నారు. ఆల్తుర్తి గ్రామంలో వందల ఎకరాలను ఓ పోలీసు అధికారికి దారా దత్తం చేశారని ఆరోపించారు. ఇవన్నీ కాకాని లీలలేనని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్ బాబు, పట్టణ టిడిపి అధ్యక్షుడు బొద్దులూరు మల్లికార్జున్ నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షుడు వెన్నపూస రాజశేఖర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ కోడూరు పెంచల భాస్కర్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అ్కం సుధాకర్ రెడ్డి, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, పార్లపల్లి సర్పంచ్ గూడూరు ప్రసన్న, ఉపసర్పంచ్ అన్నలూరు చెన్నకృష్ణమ నాయుడు, మండల తెలుగు రైతు అధ్యక్షుడు ఎత్తపు వెంకటరెడ్డి, టిడిపి నాయకులు వెన్నపూస శ్రీనివాసులు రెడ్డి, వెన్నపూస వెంకటరమణ రెడ్డి, డిప్యూటీ తాహసిల్దార్ సురేఖ, విఆర్ఓ మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యల అధ్యయనం, సత్వరపరిష్కారం విలేజ్‌విజిట్ లక్ష్యం : ఆర్డీవో




**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల అధ్యయనం, సత్వరపరిష్కారం లక్ష్యంగా విలేజ్‌విజిట్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆత్మకూరు ఆర్డీవో భూమిరెడ్డి పావని పేర్కొన్నారు. 'వన్‌మంత్‌వన్‌విలేజ్‌ఫోర్‌విజిట్స్' కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండలం మహిమలూరులో మంగళవారం తొలివిడతగా గ్రామసభను నిర్వహించారు. తహశిల్దారు పి.పద్మజాకుమారి ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆర్డీవో పాల్గొన్ని ప్రసంగించారు. ప్రభుత్వం నిర్ధేశించిన కార్యక్రమంలో భాగంగా క్రమం తప్పకుండా నెలలో ఒక గ్రామానికి నాలుగుదపాలుగా విచ్చేస్తున్నామని, ప్రజాసమస్యలు తెలుసుకుంటున్నామని, ప్రజలనుండి అర్జీలు స్వీకరిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలపరిష్కారం కోసం కార్యాలయాలకు రాకుండా తామే గ్రామాలకు విచ్చేస్తున్నామని ఆర్డీవో పేర్కొన్నారు. తమకు ప్రజలిచ్చే అర్జీల్లోని సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తున్నామని, రికార్డుల్లో ఏదేని తప్పిదాలుంటే సరిచేయనున్నామని పావని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలిచ్చిన అర్జీలను ఆమె స్వీకరించారు. ఆయా సమస్యల వివరాలను ఆమె వారినడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన సమస్యలు పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఆహశిల్దారు పద్మజా కుమారి, ఎంపిడివో పి.రఫీఖాన్, మండల రెవిన్యూఇన్స్‌పెక్టర్ ఎస్.కొండయ్య, మండల సర్వేయర్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ పి.చంద్రశేఖర్, తెలుగు దేశం నాయకులు మద్దినేని నారాయణ(జిల్లా తెలుగురైతు కార్యదర్శి), వల్లూరు వెంకటరమణారెడ్డి,వివిద శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయసిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు ఎమ్మెస్సార్ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణము నందు మంగళవారం వింజమూరు వైసిపి యూత్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్స్‌ను జడ్పిటిసి సభ్యులు గణపంబాలకృష్ణారెడ్డి వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు పల్లాల కొండారెడ్డిలు ఈ టోర్నమెంట్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వింజమూరు మండలంలోని అత్యధిక శాతం యువత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభిమానులని ప్రతి ఏడాది వ్యయప్రయాసాలకు ఓర్చి క్రికెట్ టోర్నమెంట్ను నిర్వహించడం యువతను ప్రోత్సహించడమే అవుతుందన్నారు ఈనెల 16వ తేదీ వరకు జరిగే ఈ టోర్నమెంటు క్రీడాకారులు సోదర భావంతో ఐక్యత భావంతో జరుపుకోవాలని వారు ఆకాంక్షంచారు అలాగే వివాదములు ఉండకూడదని అవి సహజంగానే వస్తాయని వారు తెలిపారు గెలిచిన వారిని ఓటమి పొందిన వారు అభినందించాల్సిన సంప్రదాయం ఉందని వారు తెలిపారు. అందరూ ఆటగాడు లేనని అది సమయ సందర్భాలుగా గెలుపోవటం జరుగుతాయన్నారు. అలాగే నిర్వాహకులు ఎంతో జాగ్రత్తగా ఈ పోటీలు నిర్వహించాలన్నారుగా 50,000 రెండవ బహుమతిగా 30,000 ప్రకటించడం హర్షనీయమన్నారు. కావున క్రీడాకారులు ఎంతో చ్ఛర భావంతో ఈ పోటీలు నిర్వహించుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ వైసీపీ నాయకులు షేక్ తాటి చెట్లకాలేశా యువ నాయకులు గణపం రమేష్ రెడ్డి మలిరెడ్డి విజయ కుమార్ రెడ్డి మద్దూరు లక్ష్మ ప్రసాద్‌రెడ్డి మద్దిరెడ్డి వీరారెడ్డి వైఎస్ఆర్సిపి యువజన నాయకులు తదితరు నాయకులు పాల్గొన్నారు.

## నేడు ప్రత్యేక విద్యుత్ లోక్‌అదాలత్

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్లోని సెక్షన్ కార్యాలయ ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఈ సుధీర్ చౌదరి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కావున ఆత్మకూరు, ఉదయగిరి, కలిగిరి సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు వారు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను వినతుల రూపంలో అందజేసి పరిష్కరించ కోవాలని ఆయన కోరారు.

అర్హులే ప్రామాణికంగా..

## ఒక గ్రామానికి నాలుగు పర్యాయాలు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని వెంకన్నపాలెంలో రెవెన్యూ శాఖ మంగళవారం గ్రామ సభను నిర్వహించారు. గ్రామసభకు ముఖ్యఅతిథిగా తహసిల్దార్ సుధీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీ చేయడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకున్నదని ప్రతి గ్రామానికి నాలుగో పర్యాయాలు కార్యక్రమం నిర్వహణ అన్నారు. తోటపల్లి గూడూరు మండలం మొత్తం 1471 పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. అత్యధికంగా వెంకన్న పాలెం గ్రామానికి 563 పాస్ పుస్తకాలు పంపిణీ చేశామని తెలిపారు. రైతుల సమస్యలు ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ప్రధాన ఉద్దేశం అన్నారు.మరోసారి ఈనెల 20, 27వ తేదీలలో పలు గ్రామాలలో గ్రామసభలు నిర్వహిస్తామని తెలిపారు. గ్రామ సభల ద్వారా రెవెన్యూ సంబంధించిన సమస్యలను తక్షణ పరిష్కారం చూపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంకన్నపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులు చింత సీతారామయ్య, మత్స్యకార యువ నేతలు పామంజి రామకృష్ణ,పేటంగారి వెంకటేశ్వర్లు, ఆర్ఐ యశ్వంత్, విఆర్ఓ రమణయ్య, మండల సర్వేయర్ మహబూబ్బాషా, సచివాలయ హౌసింగ్ అధికారిని జ్యోష్ణ, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఎస్ఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఎంట్రీకి రేపే చివరి తేదీ

**సీతారాంపురం, మేజర్‌న్యూస్ :** సంక్రాంతిని పురస్కరించుకుని మండలంలోని బసినేని పల్లిలో యువనేత చింతంరెడ్డి లోకేష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టత్మకంగా నిర్వహిస్తున్న సీఎస్ఆర్ టీ10 క్రికెట్ టోర్నమెంట్ ఎంట్రీకి గురువారం ఆఖరు తేదీ అని నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మూడు జిల్లాల సరిహద్దు ప్రాంతం కనుక నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లా సంభందించిన ఆసక్తి గల జట్లు టోర్నీలో పాల్గొనవచ్చున్నారు. టోర్నమెంట్ విజేతకు రూ 50 వేలు రన్నరప్ జట్టుకు రూ.30వేలు, మాన్ ఆఫ్ ది సిరీస్ రూ.5వేలు తోపాటు ట్రోఫీలు అధించడం జరుగుతుందన్నారు. ప్రతి మ్యాచ్‌కి మాన్ ఆఫ్ ది అవార్డు అందించడం జరుగుతుంది అన్నారు. ఆసక్తి గల జట్లు 9880998788, 7013496740 నంబర్లను సంప్రదించలన్నారు. ఈ నెల 9న ఉదయం 9 గంటలకు టోర్నమెంట్ ప్రారంభం అవుతుందన్నారు. సంక్రాతి రోజున ఫైనల్ నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

## 9న తాలూకా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఎన్నికలు

**తోటపల్లి గూడూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఇందుకూరుపేట తాలూకా యూనిట్ ఎన్నికలు ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి ఆర్.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమావేశ మందిరంలో ఈ ఎన్నికలు జరగనున్నాయని ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా అదే రోజు సంఘానికి సంబంధించిన సర్వసభ్య సమావేశం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకూరుపేట తాలూకా యూనిట్ పరిధిలో ఇందుకూరుపేట, తోటపల్లి గూడూరు మండలాలు ఉండటంతో, ఈ రెండు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు, సంఘ సభ్యులు తప్పనిసరిగా సమావేశానికి హాజరై తమ ప్రతినిధులను స్వేచ్ఛాయుత ప్రజాస్వామ్య విధానంలో ఎన్నుకోవాలని ఆయన సూచించారు. ఈ ఎన్నికలకు సి.హెచ్. లక్ష్మణ్ కుమార్ పరిశీలకులుగా, జె. సురేష్ సహాయ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.

## హాస్పిటల్ ఏర్పాటుకు అదానీ ఫౌండేషన్ అంగీకారం



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** కృష్ణపట్నం గ్రామంలో ఐదు పడకలు హాస్పిటల్ నిర్మాణానికి అదానీ ఫౌండేషన్‌కు వినతిపత్రం ఇచ్చామని స్థానికులు కరణం ఏడుకొండలు, మేకల సాయి కృష్ణ, గుండాల దేవకుమార్ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం ముత్తుకూరులో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఫౌండేషన్ సిఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ వినతిపత్రాన్ని పరిశీలించి అంగీకారం తెలిపినట్లు వెల్లడించారు. ఫౌండేషన్ కు ధన్యవాదాలు తెలిపారు.

# కేజీబీవీ విద్యార్థినుల వెతలు తీర్చిన వీపీఆర్

- ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీకి ఇన్వర్టర్ల అందజేత
- ఇటీవల పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా ఎస్ పేట కేజీబీవీకి వెళ్లిన ఎంపీ వేమిరెడ్డి
- త్వరలో పరీక్షలు.. విద్యుత్ సమస్యలు ఉన్నాయని తెలిపిన విద్యార్థినులు
- వెంటనే స్పందించిన ఎంపీ.. సొంత నిధులతో ఇన్వర్టర్ల ఏర్పాటు
- ఎంపీకి ధన్యవాదాలు తెలియజేసిన పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట ఇస్తే.. తప్పకుండా ఆదుకుంటారని మరో సారి రుజువైంది. కరెంట్ కోతలతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు చెప్పగానే స్పందించి ఇన్వర్టర్లు ఏర్పాటు చేయించి వారి వెతలు తొలగించారు. గతనెల 31వ తేదీన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి ఏఎస్‌పేట మండల కేంద్రంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పర్యటిస్తున్న సందర్భంలో విద్యార్థినులతో ఎంపీ వేమిరెడ్డి, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర ముచ్చటించారు. ఈ సందర్భంగా తాము కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని, త్వరలో పరీక్షలు ఉన్న నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా ఇన్వర్టర్లు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. వెంటనే స్పందించిన ఎంపీ వేమిరెడ్డి.. నాడు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు తమ సిబ్బందిని పంపి ఎస్టిమేషన్ వేయించారు. ఉన్న గదులకు ఎంత కెపాసిటీ సరిపోతుందో ఆరా తీయించారు. దాంతో 100 లైట్లు, 32 ఫ్యాన్లు పనిచేసేలా 2 ఇన్వర్టర్లు, 8 బ్యాటరీలు పాఠశాలలో ఇన్‌స్టాల్ చేయించి విద్యార్థినుల సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బి.శ్రీలక్ష్మి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అడిగిన వెంటనే స్పందించి తమ సమస్యలను పరిష్కరించారని అన్నారు.

# నిర్వహణ బాధ్యత ప్రణాళిక బద్ధంగా చేపట్టండి : ఇన్‌చార్జ్ మేయర్




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో ప్రజల సంతృప్తికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ నిర్వహణ బాధ్యతలను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని అన్న క్యాంటీన్‌ల నిర్వహణ కమిటీ బృందానికి మేయర్ రూప్ కుమార్ యాదవ్ సూచించారు. కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగం కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ కమిషనర్ వైఓ నందన్ అధ్వర్యంలో అన్న క్యాంటీన్ నిర్వహణ కమిటీ చైర్మన్లు, కన్వీనర్లు, మెంబర్లతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా నగరపాలక సంస్థ మేయర్ రూప్ కుమార్ కుమార్ యాదవ్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనల మేరకు అన్న క్యాంటీన్ నిర్వహణ కమిటీ మెంబర్లు స్థానికంగా ఉన్న ప్రజలను భాగస్వాములను చేస్తూ వారి పుట్టినరోజు వేడుకలు, ఇతర శుభకార్యాలతో పాటు కుటుంబ సభ్యుల జ్ఞాపకార్థంగా చేపట్టే అన్నదానం కార్యక్రమాలను విరాళాల రూపంలో అన్న క్యాంటీన్ ద్వారా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. క్యాంటీన్ నిర్వహణను అజమాయిషి చేసే విధానం ద్వారా కాకుండా సలహాదారులుగా వ్యవహరించి తగిన సూచనలు చేయాలని, నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటించని పక్షంలో తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు పూర్తి స్థాయిలో నాణ్యమైన ఆహారాన్ని అందించడం, సంతృప్తికర స్థాయిలో క్యాంటీన్లను నిర్వహించడం వంటి అంశాలపై కమిటీ మెంబర్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. కన్వీనర్లుగా ఉన్న అధికారులు క్యాంటీన్లను అనుకూలమైన సమయంలో ప్రతిరోజు సందర్శించి ఆహార నాణ్యతను పరీక్షించాలని, సలహాలు, సూచనలు ఉంటే నిర్వాహకులకు తెలియజేసి సరిదిద్దుకు నేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్లలో మరింత మెరుగైన సేవలు అందించేలా కమిటీ మెంబర్లు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, అన్న క్యాంటీన్ నిర్వహణ కమిటీ చైర్మన్‌లు, కన్వీనర్లు, మెంబర్లు పాల్గొన్నారు.

## అమ్మవారి కాత్యాయని వ్రతం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం శ్రీ అమ్మవారికి అనివెట్టి మండపం నందు ప్రత్యేకంగా ప్రత్యేకపూల అలంకారం చేసి కాత్యాయని వ్రతం చేయుట జరిగింది. స్త్రీలు సౌభాగ్యం కొరకు, ఆయురారోగ్యాల కొరకు, అన్యోన్య దాంపత్యం కొరకు ఈ యొక్క కాత్యాయని వ్రతంను చేయవచ్చును. ఈ వ్రతంను ఆచరించిన యెడల ఉత్తమమైన ఫలితములు లభించును. పై కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీవార్ల తీర్థప్రసాదాలు స్వీకరించుట జరిగింది. పై కార్యక్రమాలన్నీ ఆలయ సహాయ కమీషనరు కార్యనిర్వహణాధికారి, చైర్మన్, ధర్మకర్తల మండల సభ్యులు పర్యవేక్షణలో జరిగాయి.

## మాజీ సీఎం వైయస్ జగన్‌ను కలిసిన అంకినపల్లె



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని తన నివాసంలో మంగళవారం నెల్లూరు జిల్లా వైసీపీ ప్రచార విభాగం సభ్యులు అంకినపల్లి నరసింహారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి జగన్మోహన్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి ఆయన తనయుడు వైసీపీ యువ నాయకుడు మేకపాటి అభినవరెడ్డి ఆశీస్సులతో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని కలవడం జరిగిందన్నారు.

## బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం



**కావలి, మేజర్‌న్యూస్ :** బంగాళాఖాతంలో మంగళవారం అల్పపీడనం ఏర్పడింది. రానున్న 24 గంటల్లో మరింతగా ఈ అల్పపీడను బలపడుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. దీంతో దక్షణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లో 9వ తేదీ నుండి వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మరొకవైపు కోస్తా జిల్లాల్లో దట్టంగా మంచు కుడుస్తున్నప్పటికీ మరో నాలుగు రోజులు ఆలూరు, పశ్చిమగోదావరి జిల్లా, ప్రకాశం జిల్లా వరకు దట్టంగా మిగతా ప్రాంతాల్లో ఒక మోస్రు మంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది.

# గిరిజన హక్కులను కాలరాస్తున్నారు

- ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్‌ను ? ఇతర కులాలు అనుభవిస్తున్నాయి
- తక్షణం మరో గిరిజన మహిళకు మేయర్ పదవి ఇవ్వాలి
- లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధం
- గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** గిరిజన హక్కులను కూటమి ప్రభుత్వం కాలరాస్తోందని గిరిజన సంఘాల ఐక్యవేదిక నాయకులు ఆందోళన చేశారు. ఎస్సీ ఎస్టీలకు కేటాయించిన రిజర్వేషన్‌ను ఇతర కులాలు అనుభవించడాన్ని వారంతా తప్పు పట్టారు. నగరపాలక సంస్థ మేయర్‌గా మరో గిరిజన మహిళకు కేటాయిస్తామని చెప్పిన మాటను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గిరిజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గిరిజన సంఘాల నాయకులు కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కుల భాగంగా 40 ఏళ్లకు గిరిజన మహిళలకు మేయర్ పదవి దక్కితే దానిని చూసి ఓర్వలేక కూటమి ప్రభుత్వం ఎన్నో కుట్రలు, కుతంత్రాలను పన్నడం దారుణమన్నారు. ఇదేనా రాజ్యాంగాన్ని గౌరవించడం అంటూ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. అవిశ్వాస తీర్మానం పెడితే మాజీ మేయర్ స్రవంతికి ఓటు వేస్తారని, దీంతో ఓడిపోతామని తెలిసి.. కార్పొరేటర్‌లను భయభ్రాంతులకు గురిచేసి.. చివరకు కిడ్నాప్‌లకు కూడా తెగబడటం శోచనీయం అన్నారు. ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితులను గతంలో ఎన్నడు చూడలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మేయర్ స్రవంతిపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో ప్రస్తుత ఇన్‌చార్జ్ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ కుండ బద్దలు కొట్టినట్టుగా, మేయర్ పదవి మరో గిరిజన మహిళకు ఇస్తామని చెప్పిన విషయాన్ని గిరిజన నేతలు గుర్తు చేశారు. అయితే ఆయన ఇన్చార్జి బాధ్యతలు తీసుకొని, ఈ విషయాన్ని విస్మరించటం దుర్మార్గం అన్నారు. ఇకనైనా కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని వారంతా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాపట్ల వెంకటపతి, ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షమ సంఘం, ఆల్ ఇండియా దళిత ఫోరం రైట్స్ జిల్లా కార్యదర్శి బి.లక్ష్మణ శేఖర్, ఇతర నాయకులు పాల్గొన్నారు.